





మమ్ము దీవించమ్మా

వైభవంగా వరలక్ష్మి వ్రతం



సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఆగస్టు 16 : వరాలనిచ్చే తల్లీ వడివడిగా మమ్ము దీవించమంటూ.. కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మీ రావే మా ఇంటికి అంటూ.. మహిళలు శుక్రవారం వైభవోపేతంగా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలూ ఇవ్వాలని, పిల్లాపాపలతో చల్లగా ఉండేలా దీవించమ్మా అంటూ వేడుకున్నారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆలయాల్లో, నివాసాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉదయం నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మెదక్ పట్టణంలోని కుమ్మరిగడ్డ సంతోషిమాత, బోరంచమ్మ, సరస్వతీ ఆలయాల్లో అమ్మవారికి అభిషేకం, ఆలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు విశ్వకర్శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలోని వత్రాలు... ప్రత్యేక పూజలు నిర్వహించి సంతోషిమాతకు ఉద్యాపన వ్రతం చేశారు. సంగారెడ్డి పట్టణంలో వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. సోమ వంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌కే భవన్‌లో వరలక్ష్మి వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 116 మంది మహిళలు ఈ వ్రతంలో పాల్గొన్నారు. వీరభద్రనగర్‌లోని లక్ష్మి టెంపుల్‌లో సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



సంగారెడ్డిలోని ఎస్ఎస్‌కే భవన్‌లో వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న మహిళలు



మెదక్ కుమ్మరిగడ్డ సంతోషిమాత ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

మెదక్‌లో విశేష అలంకరణలో సంతోషిమాత



కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

మహిళలు పని లేకున్నా బస్సులో తిరుగుతున్నారన్న మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపట్టారు. పాపన్నపేటలో ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

- పాపన్నపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)

హత్యాచార నిందితులను ఉరి తీయాలి

- సంగారెడ్డిలో డాక్టర్లు, వైద్య విద్యార్థుల భారీ ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న కాలేజీ డాక్టర్లు, మెడికోలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16 : కోల్‌కతా వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల డాక్టర్లు, వైద్య విద్యార్థులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)మంజీర బ్రాంచ్ అధ్యక్షురాలు డా.ఉషారాణి, కార్యదర్శి డా.చక్రపాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్స్, నర్సింగ్ హోమ్‌లలో ఓపీతో పాటు ఎలక్టివ్ సర్జరీలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో అదనంగా 10 పడకల ఏర్పాటు

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్



పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

తూప్రాన్, ఆగస్టు 16: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య కోసం వస్తున్న రోగులకు ఇబ్బందులు కలుగకుండా మరో 10 మంచాలు ఏర్పాటు చేయాలని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్‌ను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'విజృంభిస్తున్న విష జ్వరాలు' అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ఆస్పత్రికి వచ్చారు. వివిధ విభాగాలను పరిశీలించి, 46 మంది రోగులతో మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా లాంటి జ్వరాలు బారిన పడిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

కుండపోత

రెండు గంటల్లో 12.9 సెంటీమీటర్ల వర్షం

- రహదారులు జలమయం.. రాకపోకలకు ఇబ్బందులు
- మూడు గంటల పాటు కరెంటు సరఫరాకు అంతరాయం
- అతలాకుతలమైన మెదక్ పట్టణం



జలమయమైన రాందాస్‌చౌరస్తా-మున్సిపల్ కాంప్లెక్స్ రోడ్డు



వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న బైక్‌లు



వెంకట్రావ్‌నగర్ కాలనీ జలమయం

మెదక్ అర్బన్, ఆగస్టు 16 : మెదక్ పట్టణాన్ని భారీ వర్షం ముంచెత్తింది. శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి ఆకాశాన్ని నల్లని మేఘాలు కమ్మేశాయి. ఆకాశం, భూమి ఒక్కటైన చందంగా ఏకధాటిగా రెండు గంటలపాటు వాన కురిసింది. ఎటుచూసినా వరదే చుట్టుముట్టింది. మరోవైపు ఉరుములతో భయానక వాతావరణం నెలకొన్నది. కుండపోతగా కురిసిన వర్షానికి జిల్లా కేంద్రం జలమయమైంది. రహదారులన్నీ చెరువులను తలపించాయి. దీంతో ప్రధాన దారుల్లో ట్రాఫిక్‌జాం సంభవించి రాకపోకలు నిలిచాయి. మూడు గంటలపాటు కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో రికార్డు స్థాయిలో 12.9 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదైంది.

రహదారులపై పారిన వరద నీరు

పట్టణంలోని రాందాస్ చౌరస్తా, మున్సిపల్ కాంప్లెక్స్, జేఎన్‌రోడ్డు, చమన్, ఆటోనగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులపై భారీగా వరద నీరు చేరడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అతికష్టం మీద వాటిని బయటకు తీయాల్సి వచ్చింది. ఎక్కడికక్కడ వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పోలీసుల నీరు నిలిచిన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులకు, ప్రజలకు సహాయం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతోనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ప్రజలు మండిపడ్డారు.

పొంగిపొర్లిన మడుకట్టులు

చిన్నశంకరంపేట/నిజాంపేట/వెల్దుర్తి, ఆగస్టు 16 : చిన్నశంకరంపేట మండలంలో గంటపాటు వాన దంచికొట్టగా పొలాల మడుకట్టులు పొంగిపొర్లాయి. నిజాంపేటలో మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. వెల్దుర్తిలో సాయంత్రం రెండు గంటలపాటు కురిసింది.



పడిపోయిన వాహనదారుడిని లేపుతున్న పోలీస్



జేఎన్ దారిలో ఇబ్బందులు పడుతూ వెళుతున్న వృద్ధులు



జహీరాబాద్‌లో పడుతున్న వర్షం

జలదిగ్బంధంలో అక్కల బస్తీ

రామాయంపేట, ఆగస్టు 16 : రామాయంపేట పట్టణంలోని అక్కలబస్తీ వర్షపు నీటిలో మునిగింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురియగా.. ఆ కాలనీ చిన్నపాటి కుంటలా తయారైంది. పలు ఇళ్లల్లోకి నీరు చేరింది. ఇటీవల నిర్మించిన మురుగు కాల్వలో లోపాలే ఈ దుస్థితికి కారణమైంది. సిద్దిపేట రోడ్డులోని వర్షపు నీటితో పాటు అక్కలబస్తీ మీదుగా ప్రవహించే నీరంతా ఇదే కాల్వలోకి దూసుకెళ్లటంతో సమస్య ఉత్పన్నమైంది.



రామాయంపేట అక్కల బస్తీలో వర్షపు నీరు

రికార్డు స్థాయిలో వర్షం

మెదక్ పట్టణంలో రికార్డు స్థాయిలో 12.9 సెంటీమీటర్ల కుండపోత వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికంగా నమోదైంది. పాతూర్ 9.4 సెం.మీ., చిన్నశంకరంపేట 5.4 సెం.మీ., రామాయంపేట 5.2 సెం.మీ.ల వర్షం పడింది. వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. రానున్న 24 గంటల పాటు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో 5.4 సెం.మీ., అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో 5.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జహీరాబాద్‌లో మోస్తరు వర్షం

జహీరాబాద్, ఆగస్టు 16 : జహీరాబాద్ పరిధిలో వారం రోజులుగా ఆకాశం మేఘావృతమైనప్పటికీ వాన మాత్రం పలకరించలేదు. రెండురోజులకోమారు అక్కడక్కడ చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. అయితే, శుక్రవారం మధ్యాహ్నం జహీరాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గంటపాటు మోస్తరు వర్షం పడింది. వర్షాధార పంటలు వేసిన రైతులు, ఇన్నాళ్లకు భారీ వాన కురియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గుమ్మడిదలలో నీరు చేరిన ఇళ్ల పరిశీలన

గుమ్మడిదల, ఆగస్టు 16 : గుమ్మడిదల మండల కేంద్రంలో గురువారం రాత్రి భారీ వర్షం కురియడంతో రోడ్లన్నీ జలమయం కాగా, ఇళ్లల్లోకి సైతం వరద నీరు చేరి సామన్లు తడిసిపోయాయి. కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ నీట మునిగిన పట్టణంలోని ఓబుల్‌రెడ్డి ఇల్లును, సమీపంలోని మార్కెట్ సంతను పరిశీలించి నష్ట వివరాలను తెలుసుకున్నారు.

డెంగ్యూ డేంజర్ బెల్స్

సంగారెడ్డి జిల్లాలో 125 కేసులు నమోదు

ఆస్పత్రులకు క్యూ కడుతున్న జ్వర బాధితులు



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 15 : సంగారెడ్డి జిల్లాలో డెంగ్యూ, విష జ్వరాల పంజా విసురుతున్నాయి. వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పులతో ప్రజానీకంపై ప్రభావం చూపుతున్నది. డెంగ్యూ జ్వరాలు పడగ విప్పి ప్రజలపై విరుచుకపడుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలల్లో ఏ గడప తట్టినా జ్వర పీడిత కనిపిస్తున్నారు. రోజురోజుకూ వ్యాధుల విజృంభణ పెరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

డెంగ్యూ, టైఫాయిడ్ విజృంభణ

ఈ సీజన్‌లో జిల్లాలో 125 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి అంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. డెంగ్యూ పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదు కావడంతో బిక్కుబిక్కుమనే పరిస్థితులున్నాయి. ఇంట్లో ఒక్కరికొస్తే మిగతా వారిని చుట్టుముడుతున్నాయి. మొదట స్వల్పంగా జలుబు, రెండో రోజు జ్వరం, గొంతు నొప్పి వంటి లక్షణాలు బయటపడుతున్నాయి. వీటికి డెంగ్యూ కేసులు తడవడంతో ఆస్పత్రులకు జ్వర బాధితులు వరుస కడుతున్నారు. జిల్లాలో టైఫాయిడ్ కేసుల చూస్తే ఇప్పటి వరకు 586 కేసులు నమోదయ్యాయి. అయితే గత రెండు నెలలతో పోల్చితే ఈ నెలలో టైఫాయిడ్ కేసులు తగ్గాయి. జిల్లాలోని గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, జీహెచ్‌ఎంసీ ఏరియాల్లో జ్వరపీడిత బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం.. దోమల స్వైర్యవిహారం

దోమల్లో ఏడీస్ ఈజిప్ట్ జాతి దోమ కుట్టడం వల్లనే డెంగీ సోకుతుంది. ఇవి ఎక్కువగా ఇళ్ల సమీపంలోని ఖాళీ స్థలాల్లో, నిల్వ నీటిలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. తాగిపడేసిన కొబ్బరి బొండాలు, పాత నీటి కుండలు, తొట్టీలు ఈ సంతతిని వృద్ధి చేసుకునేందుకు అనుకూలంగా ఉంటాయి. దోమల అరికట్టడానికి రోజూ రసాయన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. రాత్రి సమయంలో ఫాగింగ్ చేపట్టాలి. మురుగు కాలవులను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ప్రజలు సైతం వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. అయితే పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కొరవడి దోమలు వృద్ధి చెందుతున్నాయనే ఆరోపణలున్నాయి. తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపట్టడంతో దోమల వృద్ధికి కారణమతున్నాయి. అంతే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇంటింటి జ్వర సర్వే కూడా మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. చికిత్స కంటే నివారణకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సీజనల్ వ్యాధులతో జీజీహెచ్‌కు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఎలీసా పరీక్ష ద్వారా డెంగ్యూ నిర్ధారణ చేస్తున్నాం. డెంగ్యూ బారిన పడితే తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం ఉంటుంది. ప్లేట్‌లెట్లు పడిపోతే ఒంటిపై దద్దుర్లు రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం రాగానే అశ్రద్ధ చేయొద్దు. జ్వరాలన్నీ డెంగ్యూ జ్వరాలు కావు. డాక్టర్లను సంప్రదించి సకాలంలో చికిత్స పొందితే మేలు. డాక్టర్లు, సిబ్బంది, మందులు, నిర్ధారణ కిట్లు, పడకల కొరత మాత్రం లేదు.

- డా.అనీల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

ట్రిపుల్‌ఆర్ కోసం భూములు లాక్కోవడం దారుణం

- అలైన్‌మెంట్‌ను మార్చాలి
- భూబాధితుల డిమాండ్



సమావేశంలో రైతు నాయకులు

కొండాపూర్, ఆగస్టు 16 : తాతా ముత్తాల కాలం నుంచి వ్యవసాయమే జీవన ఆధారంగా బతుకుతున్న తమ భూముల్లో నుంచి ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం లాక్కోవడం దారుణమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిర్మాపూర్‌లో జిల్లా రైతు సంఘాల నాయకుల ట్రిపుల్‌ఆర్ భూబాధితుల సమావేశం నిర్వహించారు. అలైన్‌మెంట్ మార్చాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతులు ఇచ్చినా స్పందన లేదని రైతులు వాపోయారు. చట్టసభల్లో మాట్లాడి రైతులపక్షాన నిలవాల్సిన నాయకులు మౌనం వహించడం పట్ల రైతుల మనసులు కలత చెందుతున్నాయన్నారు. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 99 ఉంటే 54 సర్వేనంబర్లలో 118 ఎకరాల భూమి పూర్తిగా ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం తీసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా, కావాలనే పట్టాభూమి నుంచి రోడ్డు పనులకు ప్రణాళికలు రచించారన్నారు. తక్షణమే అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రైతులతో జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నరసింహారెడ్డి, పృథ్వీరాజ్, జయరాజు గిర్మాపూర్, పెద్దాపూర్ రైతులు పాల్గొన్నారు.

రైతులే లైన్‌మన్‌లు





పోతులబోగుడ శివారులో మూడు రోజుల క్రితం విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రైతులే శుక్రవారం మరమ్మతులు చేసుకున్నారు. ఈ విషయమై ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా సంబంధిత లైన్‌మన్‌ను పంపించేందుకు ప్రయత్నించే లోపే రైతులు మరమ్మతులు చేసుకున్నట్లు తెలిపారు

- వట్‌పల్లి

హెరాయిన్ విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

- పరారీలో మరొకరు

పటాన్‌చెరు, ఆగస్టు 16: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో డ్రగ్స్ కలకలం రేగింది. ఇప్పటి వరకు కేవలం గంజాయి లాంటి దేశవాళీ మత్తుపదార్థాలు పట్టుకోవడం చూశాం. ఇప్పుడు ఏకంగా హెరాయిన్, ఓపీఎం లాంటి అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్ పట్టుపడటం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలను పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగారెడ్డి ఏఎస్పీ సంజీవ్‌రావ్ వెల్లడించారు. పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ పంచాయతీ పరిధిలోని రాదమ్మ కాలనీలో నివాసం ఉండే రాజస్థాన్ యువకుడు డ్రగ్స్ విక్రయిస్తున్నాడని యాంటీ నార్కోటిక్ బ్యూరోకు సమాచారం అందింది. బ్యూరో డీఎస్పీ పుష్పకుమార్, ఎస్‌వోటీ సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి పోలీసు బృందాలతో శుక్రవారం ఉదయం దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడు బుధారాం(33) కొంత కాలంగా చిట్కుల్ రాధమ్మ కాలనీలోని బిగారి మానిక్యం ఇంట్లో అద్దెకు ఉంటూ డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. రాజస్థాన్ రాష్ట్రం బర్మార్ జిల్లా భిలాన్‌ఖిదాని గ్రామానికి చెందిన బుధారం స్టీల్ రేలింగ్ పనులు చేస్తూ రహస్యంగా డ్రగ్స్ దందా ప్రారంభించాడు. బీడీఎల్‌లో నివాసం ఉండే బుధారం చిన్నాన్న కుమారుడు కోశాలరాం తక్కువ ధరకు డ్రగ్స్ తెచ్చి ఇవ్వగా ఇద్దరు కలిసి ఎక్కువ ధరకు విక్రయిస్తూ కొంతకాలంగా సొమ్ము చేసుకుంటున్నారు. నిందితుడిని నుంచి 8 గ్రాముల హెరాయిన్, 34 గ్రామలు ఓపీఎం డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు కోశాలరాం ప్రస్తుతం పరారీలో ఉన్నాడని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఏఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల సంచారం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 16: సిద్దిపేటలో రెండురోజుల క్రితం అర్ధరాత్రి ఐదుగురు సభ్యులతో కూడిన దొంగల ముఠా పలు కాలనీల్లో సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సీతారాంనగర్ కాలనీల్లో 14న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో దొంగలు సంచరిస్తున్నట్లు ఇళ్ల ముందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో రికార్డైన వీడియో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాలని పలువురు కోరుతున్నారు.

సమయానికి బస్సులు నడపాలి

● ప్రధాన రహదారిపై విద్యార్థుల ధర్నా



బస్సులు సమయానికి నడపాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్, ఆగస్టు 16: బస్సులు సమయానికి రాకపోవడంతో తాము క్లాసులు మిస్సవుతున్నామని విద్యార్థులు ఆందోళన చేస్తూ శుక్రవారం చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇంటినుంచి వచ్చి ఎంతసేపు వేచిచూసినా.. బస్సులు సమయానికి రావడం లేదని ఆరోపించారు. దీంతో తాము క్లాసులు మిస్సవుతున్నామని, సాయంత్రం కూడా ఇంటికి రావడానికి ఆలస్యం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు పరిష్కారం లభించేవరకూ కదలబోమని రోడ్డుపై భీష్మించి కూర్చున్నారు. దీంతో గంటపాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పాడెపు పాండరి, నాయకుడు నర్సింహారెడ్డి విద్యార్థులను సముదాయించి బుధవారం వరకు సమస్యను పరిష్కారం చేయిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆవుల రాజిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



భానుప్రసాద్ (ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 16: కుటుంబ కలహాలతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కొమ్మట భానుప్రసాద్(26)కు భార్యతో రెండురోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భానుప్రసాద్ సమీపంలోని పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


వరలక్ష్మీదేవిగా అమ్మవారు


ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను సన్మానిస్తున్న వేదపండితులు


ఆలయ మండపంలో చిన్నారులకు అక్షర స్వీకారాలు

వరాల తల్లి.. విద్యా సరస్వతీ అమ్మవారు

- వర్గల్ విద్యాధరి క్షేత్రంలో వైభవంగా మూలమహోత్సవం
- వరలక్ష్మి అలంకరణలో అమ్మవారు
- వేడుకలకు తరలివచ్చిన వేలాధిమంది భక్తులు
- భక్తిపారవశ్యమైన క్షేత్రం

వర్గల్, ఆగస్టు 16: వర్గల్ కేంద్రంలోని శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారు శ్రీవరలక్ష్మి అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవరలక్ష్మి, మూలనక్షత్రం ఒకేరోజు రావడంతో విద్యాధరి క్షేత్రానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలతో పాటు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం శ్రీవరలక్ష్మి అలంకరణలో విద్యాసరస్వతీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రంలో వందల సంఖ్యలో చిన్నారులకు అక్షర స్వీకారాలు చేశారు. మూల సందర్భంగా ఆలయంలో చండీ హోమం, అమ్మవారికి లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కృషిచేస్తున్న దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రసాదాలను అందజేశారు. వేడుకల సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శంభుగిరి కొండలు భక్తిపారవశ్యమైనాయి.

నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

వర్గల్, ఆగస్టు 16: జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ యాగశాలలో వేదపండితులు హోమాది కార్యక్రమాలు జరిపారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. వేడుకల సందర్భంగా నాచగిరి పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.


వర్గల్ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

రెండు బైకులు ఢీకొని, యువకుడి మృతి

- నలుగురికి తీవ్రగాయాలు


మహేష్(ఫైల్)

నారాయణఖేడ్, ఆగస్టు 16: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో యువకుడు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మండల కేంద్రమైన రేగోడుకు చెందిన వెన్నెల మహేష్(20) ఇటీవల ఇంటర్ ఉత్తర్ణత సాధించడంతో, బీఫార్మసీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి రావడంతో.. అదే గ్రామానికి చెందిన మిత్రులు నవీన్(20), సాయికిరణ్(19)లతో కలిసి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు శుక్రవారం మధ్యాహ్నం (టీఎస్ 35 జీ9746) నెంబరు గల బైక్‌పై వచ్చారు. తిరిగి రేగోడుకు వెళ్తున్న క్రమంలో.. అదే మండలం టి.లింగంపల్లికి చెందిన సయ్యద్(25), రేహాన్(25).. టీఎస్ 35 జీ 2050 నెంబరు గల బైక్‌పై వస్తుండగా.. నారాయణఖేడ్ మండలం రుద్రార్ ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఖేడ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇందులో వెన్నెల మహేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో.. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు వెన్నెల మహేష్ తండ్రి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వెనక నుంచి డీసీఎంను ఢీకొట్టిన లారీ

- డ్రైవర్ మృతి, ముగ్గురికి గాయాలు


అమీన్‌ఖాన్(ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 16: డీసీఎంను వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో డీసీఎం డ్రైవర్ మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నర్సాపూర్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ లింగం శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో కొండా బ్రదర్స్ బట్టల దుకాణం వద్ద నుంచి వెళ్తున్న డీసీఎంను హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ వేగంగా వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో డీసీఎం ఒక్కసారిగా అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లి.. అక్కడున్న స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అమీన్‌ఖాన్(48) క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలకు గురయ్యాడు. డీసీఎంలో ఉన్న నర్సింహులు, వెంకటేశంగౌడ్, శ్రీధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘటన

రామాయంపేట, ఆగస్టు 16: భార్యాభర్తలు కలిసి బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఘటన శుక్రవారం రాత్రి రామాయంపేట పాత హైవేపై చోటు చేసుకున్నది. నార్సింగి మండలం జప్తిశివనూర్‌కు చెందిన మదార్ తన భార్య బీబీతో కలిసి గజ్వేల్ ప్రాంతంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని వస్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో ఢీకొట్టింది. ఈ ఘటనలో మదార్(55) అక్కడికక్కడే మృతిచెందగా.. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.పోలీసులు అక్కడికి చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గుండారెడ్డిపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వృద్ధుడి మృతదేహం

కోహెడ, ఆగస్టు 16: మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కారెడ్డి కనకయ్య అనే రైతు వ్యవసాయ బావి సమీపంలో ఓ వృద్ధుడి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి ముందుగా పంచాయతీ కార్యదర్శి అంబటి రాజశేఖర్ వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై గాయాలు లేవని, ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుపు గీతల చొక్కా, నల్ల ప్యాంటు, బూట్లు ధరించిన వృద్ధుడి జేబులో రూ.3 వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. అలాగే చేతికి గడియారం ఉన్నదని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల వరకు ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

జిన్నారం, ఆగస్టు 16: కుటుంబ కలహాలతో భార్యను హత్యచేసిన కేసులో భర్తను బొల్లారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ ఫేస్‌బుక్‌లో పరిచయమైన హర్సతీకాతున్(25)ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ కొంతకాలం క్రితం ఉపాధికోసం బొల్లారంకు వచ్చి నివాసముంటున్నారు. ఈ నెల 7న అనిల్‌కుమార్ భార్యను కాతున్ పారిశ్రామికవాడలోని ఫోటున్ పరిశ్రమ సమీపంలో మెడకు చున్నీ బిగించి హత్యచేశాడు. కుళ్లిన స్థితిలో ఉన్న ఆమె మృతదేహాన్ని 13న పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. భర్త అనిల్‌కుమార్ హత్యకు పాల్పడ్డట్లు తేలింది. బీహార్‌కు పారిపోయిన అనిల్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కొమురవెల్లిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్


విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, ఆగస్టు 16: కొమురవెల్లి మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తూ, అవసరాల కోసం విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. శుక్రవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లండించారు. కామారెడ్డికి చెందిన కంకణాల భరత్‌కుమార్ కొద్దిరోజులుగా కొమురవెల్లి మండల కేంద్రంలోని వైన్‌షాప్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న కామారెడ్డికి చెందిన చిటికె నాగరాజు తరచూ భరత్‌కుమార్ దగ్గరికి వచ్చిపోతున్న క్రమంలో ఫతేనగర్ నుంచి గంజాయి తీసుకొచ్చి భరత్‌కుమార్‌కు ఇస్తూ సేవించడంతో పాటు డబ్బుల కోసం ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా కొమురవెల్లికి చెందిన లింగంపల్లి దుర్గయ్యకు అందించేవారని తెలిపారు. శుక్రవారం ముగ్గురూ కలిసి గ్రామశివారులో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాగరాజు వద్ద 40 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్, భరత్‌కుమార్ నుంచి మొబైల్ ఫోన్, లింగంపల్లి దుర్గయ్య వద్ద గంజాయి సేవించేందుకు తాటి ఆకులతో తయారు చేసిన చిల్లాను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును పరిశోధించిన ఎస్ఐ రాజు, సిబ్బందిని సీఐ అభినందించడంతో పాటు జిల్లా పోలీస్ కమిషనర్ ద్వారా రివార్డును అందజేస్తామని పేర్కొన్నారు.


పట్టుబడిన గంజాయి, సెల్‌ఫోన్లు, చిల్లా

జంతువులను హింసిస్తే కఠిన చర్యలు

- జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 16: జంతువులను హింసిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో ఉండాలన్నారు. మూగ జీవులను హింసించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అక్కడక్కడ కుక్కల బెడద ఉందని, వాటి సంఖ్యను తగ్గించడానికి యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) వంటి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకోసం జిల్లాలో కుక్కల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 43,751, మున్సిపాలిటీల్లో 17,770 కుక్కలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని ఏబీసీ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఇంట్లో చెత్తను మున్సిపాలిటీ వాహనాల్లోనే వేయాలని, బయట పారేయకూడదని, అలా చేస్తే కుక్కలు చెత్త వేసిన ప్రాంతాల్లో చేరతాయన్నారు. వాటి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. దాబా, హోటళ్లు, మాంసం దుకాణాల యజమానులు చెత్తను రోడ్ల పక్కన వేయకూడదని సూచించారు. కుక్కలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని, చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు తోడు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జేడీ వసంతకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, డాక్టర్లు రవీందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ భాష మార్చుకోవాలి: ఎమ్మెల్యే చింతా


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 16: అమెరికా వెళ్లి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి చిప్పు దొబ్బిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రాల సీఎంలు కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష మాట్లాడటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలని సూచించారు. అలవి కాని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెడతారన్న భయంతోనే తూతూ మంత్రంగా రైతు రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదన్నారు. అసెంబ్లీలో కూడా రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత క్రమశిక్షణ లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు కాక మీదున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గానీ, మంత్రులుగానీ గ్రామాల్లో పర్యటిస్తే అడ్డుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు రైతుబంధు లేదు, కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలుగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, శివకుమార్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి: ఎంపీ రఘునందన్‌రావు


ఎంపీ రఘునందన్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త, మంగువారి ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు మంగు రాధాకృష్ణరావు

నంగునూరు, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సగం మంది రైతులకే మాఫీ చేసిందని, ప్రతీ గ్రామంలో రైతులు తమకు రుణమాఫీ కాలేదని చెప్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వందశాతం రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. షరతులు, నిబంధనలను విధించి 50శాతం మందికే రుణమాఫీ చేశారని విమర్శించారు. రుణమాఫీ విషయంలో క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీలకు వచ్చి రచ్చబండ వద్ద తెలుసుకోవాలన్నారు. గొప్పలు చెప్పుకోవడం కంటే గ్రామస్థాయిలోకి వెళ్లి రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తుంగ కనకయ్య, వెంకట్రాంరెడ్డి, వెంకటరెడ్డి, తిరుపతిరావు, వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, మంగు వారి ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు మంగు రాధాకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో ఎంపీ పూజలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 16: సిద్దిపేటలోని శ్రీ వెంకటేశ్వరాలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఎంపీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

వెండికోలు, కోర్పోలు రైతులతో సమావేశం

పుల్‌కల్, ఆగస్టు 16: చౌటకూర్ మండలంలో ట్రిబుల్ ఆర్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సమావేశానికి హాజరైన రైతులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ధరలకనుగుణంగా పరిహారం చెల్లించాలంటూ రైతులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సర్వే నంబర్లలోనూ తేడాలు ఉన్నాయని, తప్పుడు సర్వేలు చేపట్టారని అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులను గుర్తించేందుకు మరోమారు క్షేత్ర స్థాయిలో రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి ఏర్పాటులో భూములు కోల్పోకపోయినప్పటికీ, నోటీసులు జారీచేశారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇప్పటికే హైటెన్షన్ విద్యుత్ టవర్ల ఏర్పాటుతో భూములు కోల్పోయామని తాజాగా ట్రిబుల్ ఆర్ ఏర్పాటుతో మళ్లీ ఉన్న కాస్తా భూములను కోల్పోవాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోయారు.

మున్సిపాలిటీలో విలీనం వద్దు..

- ఎంపీ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్, మాజీమంత్రులకు గ్రామస్థుల వినతి

జహీరాబాద్, ఆగస్టు 16: జహీరాబాద్ సమీపంలోని హోతి(కే) గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దంటూ గురువారం సాయంత్రం పట్టణంలోని ఎంపీ గెస్ట్‌హౌజ్‌లో ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్‌తో గ్రామస్థులు వేడుకున్నారు. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం మున్సిపల్ అధికారులు మరోమారు వార్డుల విభజన సవరింపుల ప్రక్రియను చేపట్టారు. ఈ విషయమై జహీరాబాద్ ఎంపీ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని గెస్ట్‌హౌజ్‌కు పిలిపించి వార్డుల విభజన సవరింపుల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాము వార్డుల విభజన సవరింపుల ప్రక్రియను ఓటర్లకు, ప్రజలకు అనుకూలంగానే చేపడుతున్నామని వివరించారు. ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, గిరిధర్‌రెడ్డి స్పందిస్తూ విలీన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా చూస్తామని గ్రామస్థులకు హామీఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దంటూ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలకు విన్నవిస్తున్న హోతి(కే)గ్రామస్థులు

రెవెన్యూ పాలన పారదర్శకంగా జరగాలి


తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్

తూప్రాన్, ఆగస్టు 16: రెవెన్యూ పాలన అత్యంత పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం సందర్శించి పరిశీలించారు. కార్యాలయంలో ఫైళ్ల నిర్వాహణ, ల్యాండ్ రెవెన్యూ, ల్యాండ్ మేనేజ్‌మెంట్, ట్రిపుల్ ఆర్, రెవెన్యూ కలెక్షన్, ప్రజల కనీస అవసరాల గురించి సిబ్బంది పనితీరును ఆర్డీవో జయచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు.

చోరీల నివారణకు పకడ్బందీ చర్యలు


ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

పాపన్నపేట, ఆగస్టు 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ రక్షణ, చోరీల నివారణ కోసం కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ ఏడుపాయల ఆలయాన్ని సందర్శించారు. ఇటీవల జరిగిన చోరీ తీరును పరిశీలించారు. ఆలయం వద్ద చోరీల నివారణ, పరిసర ప్రాంతాల పరిరక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే మంగళవారం ఈ విషయమై చర్చిస్తామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల తీరును పరిశీలించారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ గ్రామీణ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

వరలక్ష్మివ్రతాలతో ఆధ్యాత్మిక సందడి


తూప్రాన్ గీతా మందిరంలో వరలక్ష్మి వ్రతాలు


చిలప్‌చెడ్, జగ్గంపేట హనుమాన్‌ఆలయంలో పూజలు


జహీరాబాద్: మాణిక్‌ప్రభు పాఠశాలలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆలయాల్లో శుక్రవారం ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇళ్లలో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోగా, ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలో 9 రకాల పువ్వులు, 5 రకాల పండ్లను, 5 రకాల నైవేద్యాలను సమర్పించుకున్నారు. ముత్తైదువలు పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

తూప్రాన్, ఆగస్టు 16: తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరంలో పూజారి ఉదయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజల్లో పాల్గొని పరస్పరం పసుకుంకుమలు ఇచ్చిపుచ్చుకున్నారు.

● చేగుంట: మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మివ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పరస్పరం పసుపుకుంకుమలతో వాయినాలు సమర్పించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● పెద్దశంకరంపేట: మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో మహిళలు భారీగా పాల్గొన్నారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వ్రతాలు నిర్వహించారు. పూజారి రాయల మహేష్ శర్మ, వరలక్ష్మివ్రతం యొక్క విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దాదిగారి గంగాధర్, కార్యదర్శి క్రాంతిలాల్, పున్నయ్య, జంగంరాములు, ప్రధానాచార్యులు వీరప్ప, జైహింద్‌రెడ్డి, శ్రీనివాస్, సీతారామారావు, ఆచార్య బృందం ఉన్నారు.

● అల్లాదుర్గం: మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు అమ్మవారిని వివిధ రకాల పువ్వులు, వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించి వాయనాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని పోచమ్మ, కొర్విపల్లి దుర్గామాత ఆలయంలోని అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చన, పూజలు చేశారు.

●చిలప్‌చెడ్: మండలంలోని జగ్గంపేటలో టీటీడీ వారి ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకు గోపూజ నిర్వహించారు. అనంతరం హనుమాన్ మందిరంలో సామూహిక వరలక్ష్మివ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ జిల్లా ఉపన్యాసకులు రాంరెడ్డి పురోహితులు లక్ష్మీనారాయణ పంతులు హనుమాన్ భక్తమండలి, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

● జహీరాబాద్: నియోజక వర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండితులు, పురోహితులు వరలక్ష్మి వ్రత విశిష్టత గురించి మహిళలకు వివరించారు. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాలతో పాటు ఆయా పాఠశాలల్లో వరలక్ష్మివ్రతాన్ని నిర్వహించారు. పూజల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

● వట్‌పల్లి: మండలంలో వరలక్ష్మి వ్రతాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్లలో వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

● కంగ్టి: కంగ్టితోపాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను అత్యంత నియమ నిష్ఠలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో లక్ష్మీదేవిని పూజించారు.

తాగినమత్తులో చెరువులో పడి యువకుడి మృతి


మహేష్(ఫైల్)

చేగుంట ఆగస్టు 16: తాగినమత్తులో ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని చందాయిపేట్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. చేగుంట ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అచ్చంపేట మహేష్(26) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. తండ్రి మందలించడంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తాగిన మత్తులో గ్రామ శివారులోని పెద్దచెరువులో పడిపోయాడు ఈతగాళ్లతో గాలించగా శుక్రవారం మహేష్ మృతదేహం లభ్యమైంది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

కడుపునొప్పి భరించలేక యువతి బలవన్మరణం


స్వప్న మృతదేహం

మాసాయిపేట, ఆగస్టు 16: మండల కేంద్రంలోని ఓ యువతి కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చేగుంట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన జంగటి స్వప్న(33) అనే యువతి కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందింది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కడుపునొప్పితో బాధపడుతున్న స్వప్న చీర కొంగుతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మల్లేశం(ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 16: రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని కాశింపూర్ గ్రామం చెందిన కుంట మల్లేశం(40) గత ఏడాది బతుకుతెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ పట్టణానికి వెళ్లాడు. పని నిమిత్తం బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా మల్లేశం చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు సంపత్, సందీప్ ఉన్నారు. మల్లేషం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్, ఆగస్టు 16: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 20 వరకు నారాయణఖేడ్ డిపో నుంచి పటాన్‌చెరు, లింగంపల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్‌లకు అదనపు బస్సులు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎం.ప్రభులత, డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం సూచనల మేరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ కోదండరాంను అభినందించిన తుల్జారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు కోదండరాంను సంగారెడ్డి జిల్లా టీజేఎస్ అధ్యక్షుడు పాతదొడ్డి తుల్జారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు నేడు ఆఖరు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16: ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 17వ తేదీతో గడువు ముగియనుందని కన్వీనర్ రాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో ఫేజ్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పలు గ్రామాల్లో 'ఫ్రైడే-డ్రైడే'

చిన్నశంకరంపేట,ఆగస్టు 16: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పలు చోట్ల బంద్ విజయవంతం

కంగ్టి/వెల్దుర్తి, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కంగ్టి బంద్ సంపూర్ణంగా కొనసాగింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు, మూసి ఉంచారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అదేవిధంగా వెల్దుర్తిలో విశ్వ హిందూ పరిషత్, బీజేపీల ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపార వాణిజ్య సంస్థల స్వచ్ఛందంగా మూసివేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే


రుద్రారంలో మున్నూరుకాపు కమ్యూనిటీహాల్ ప్రారంభిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలో సీడీపీ నిధులతో మంజూరైన మున్నూరుకాపు కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఏక కాలంలో రైతులకు రూ. రెండు లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు నవీన్, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, రంగారావు, లక్ష్మణ్, సిద్దిరాములు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

పేదింటి ఆడకూతుళ్లకు వరం కల్యాణలక్ష్మి

పాపన్నపేట, ఆగస్టు 16: పేదింటి ఆడ కూతుళ్ల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేటలోని మండలపరిషత్ కార్యాలయంలో 45 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద మహిళలు తమ కూతుళ్ల పెళ్లి చేసే క్రమంలో ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద అందించే ఆర్థికసాయం ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తన మాట నిలుపుకున్నారని తెలిపారు.


సంగారెడ్డిలో ప్రణతికి సిల్వర్ మెడల్‌తో సత్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కిక్ బాక్సింగ్ విజేతకు మంత్రి అభినందన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16: మహిళల కిక్ బాక్సింగ్ పోటీల్లో కొండాపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన విద్యార్థిని ప్రణతి సత్తా చాటారు. జాతీయస్థాయిలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రణతి రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రణతిని మంత్రి దామోదర రాజనర్సింహ సిల్వర్ మెడల్‌తో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.

'సెయింట్ ఆంథోనీస్'లో అలరించిన ప్రదర్శనలు


సెయింట్ ఆంథోనీస్‌లో విద్యార్థిని నృత్యప్రదర్శన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16: సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. దేశభక్తి గీతాలపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నది. అనంతరం విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత సల్‌మోన్‌రెడ్డి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సల్‌మోన్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి: డీఎంహెచ్‌వో


దేవులపల్లిలో జాగ్రత్తలు తెలియజేస్తున్న డీఎం హెచ్‌వో శ్రీరాములు

కొడిపల్లి , ఆగస్టు 16: అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని డీఎంహెచ్‌వో శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవులపల్లి గ్రామంలో ఓ గర్భిణికి డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నాయనే సమాచారంతో ఆ గ్రామాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. ఇ సందర్భంగా గ్రామంలోని వీధులగుండా తిరుగుతూ పారిశుధ్యాన్ని పరిశీలించాం లేదా దోమలు వృద్ధి చెందుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిరావు పూలే వేషధారణ


పూలే వేషధారణలో విద్యార్థి ఆరుష్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఓ విద్యార్థి పూలే వేషధారణతో అందరినీ ఆకట్టుకున్నాడు. సంగారెడ్డి పట్టణంలోని పయనీర్ పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి అంకని ఆరుష్ జ్యోతిరావు పూలే వేషదారణలో పాఠశాలకు వచ్చి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడంతో తోటి విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సదరు విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

జనావాసాల నుంచి గ్యాస్ గోదాంను తరలించాలి

● మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే విజ్ఞప్తి


వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 16: పటాన్‌చెరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పౌరసఫరాల మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న పౌరసరఫరాల గ్యాస్‌గోదాంను శివారు ప్రాంతానికి తరలించాలని మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గోదాం పక్కనే ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయంలోకి రిజిస్ట్రేషన్ కార్యాలయం వస్తోందని మంత్రికి వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ శివారులోని రామేశ్వరం బండ గ్రామంలోకి గోదాంను తరలిస్తే మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం మంత్రి సూచనల మేరకు రాష్ట్ర పౌరసఫరాల కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్‌కు పరిస్థితిని వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో పెండింగ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించారు. మౌలిక వసతులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిధులు కావాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 27న రాష్ట్ర రేషన్ డీలర్ల మహాసభ

ఈ నెల 27వ తేదీన పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సదస్సు ఏర్పాటు చేస్తున్నామని డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. డీలర్ల సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కమిషనర్ డీఎస్.చౌహాన్‌లకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. మంత్రి, కమిషనర్‌ను డీలర్ల సభకు ఆహ్వానించిన వారిలో ఎమ్మెల్యేతో పాటు డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటిరాజు ఉన్నారు.

సమస్యల సాధన కోసం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె

రేగోడు ఆగస్టు 16: రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి ఈ నెల 20 నుంచి సమ్మెకు సిద్ధమైనట్లుగా ఆరోగ్యశ్రీ సంగారెడ్డి జిల్లా కార్యవర్గం సభ్యులు హిమగిరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజోతితో మాట్లాడారు. జీతాల పెంపు, క్యాడర్ మార్పు, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ, హెల్త్ మినిస్టర్, సచివాలయ అధికారులకు ఎన్నోసార్లు తమ బాధలపై విన్నవించినా ఎటువంటి స్పందన లేదని అందుకే ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మెకు సిద్ధం కావాల్సి వచ్చిందని తెలియజేశారు. దేశంలో ఏ ఉద్యోగికి లేని విధంగా జీపీఎస్ టాకింగ్ సిస్టం, అనవసర నివేదికలు సమర్పించాలని ట్రస్ట్ అధికారుల ఒత్తిడికి లోనవుతున్నామన్నారు.

తల్లిగారింటికి వెళ్లిన మహిళ అదృశ్యం


అదృశ్యమైన అనిత

తూప్రాన్, ఆగస్టు 16: తల్లి గారింటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. తూప్రాన్ పోలీసుల వివరాల ప్రకారం.. నర్సంపల్లికి చెందిన జింక రవికి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన పట్నం అనిత (40)తో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. మూగ వాడైన రవి, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. ఈ నెల 14న కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లగా అనిత తల్లిగారింటికి వెళ్లేందుకు నిర్ణయించుకుంది. పెద్దకుమారుడు భాను ప్రసాద్‌ను అంతగిరిపల్లికి వెళ్లేందుకు నాచారం వద్ద వదిలి రావాలని కోరి, వెంట తీసుకెళ్లింది. కొద్ది దూరంగా వెళ్లగానే కొడుకును ఇంటికి పంపించి తానే వెళ్తానని చెప్పింది. నర్సంపల్లి నుంచి వెళ్లిన అనిత అనంతగిరిపల్లికి వెళ్లలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్టీ మహిళను కులం పేరుతో దూషించినవారిపై కేసు

శివ్వంపేట, ఆగస్టు 16: భూ వివాదంలో ఎస్టీ మహిళను కులం పేరుతో దూషిస్తూ ఆమెపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం సికింద్లాపూర్ పిట్టలవాడలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడలో పిట్టలవారికి సర్వేనంబర్ 193/అ/9లో 2ఎకరాల 33 గుంటల భూమి ఉంది. కాగా పిట్టలవారికి, భూపాల్‌రెడ్డి, మార్కాంరెడ్డిల మధ్య కొంతకాలంగా భూవివాదం నెలకొన్నది. ఈ నేపథ్యంలో గురువారం మార్కాంరెడ్డి, భూపాల్‌రెడ్డి భూమిలో కడీలు పాతుతుండగా తమ భూమిలో పాతవద్దని పిట్టలవారు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పిట్టల వాడకు చెందిన ఎస్టీ మహిళ రేఖను కులం పేరుతో దూషించి దాడి చేయడంతో బాధితురాలు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇదే విషయమై ఎస్ఐపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల జోక్యంతో మహిళపై దాడి చేసిన మార్కం రెడ్డి, భూపాల్‌రెడ్డి, వంశీ ముగ్గురితో పాటు మరి కొంతమందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 16: సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష మార్చుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రాల సీఎం కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష మాట్లాడటం లేదన్నారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెడతారన్న భయంతోనే తూతూ మంత్రంగా రైతు రుణ మాఫీ చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదన్నారు. అసెంబ్లీలో కూడా రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత క్రమశిక్షణ లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గానీ మంత్రులుగానీ గ్రామాల్లో పర్యటిస్తే అడ్డుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, శివకుమార్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయంతోనే భవిష్యత్తుకు మనుగడ

కంగ్టి, ఆగస్టు 16: సేంద్రియ వ్యవసాయం ద్వారానే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుందని ఫ్యాక్ట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్మోహన్‌రావు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టిలో వాటర్‌సంస్థ కేవీకేల ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధిక దిగుబడుల మోజులో రైతులు విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు (ఫ్యాక్ట్) ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ సంస్థ పని చేస్తుందన్నారు. రైతులకు మట్టి నమూనాల నివేదికలతో పాటు దోమ తెరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్‌సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రవిప్రసాద్, జ్యోతిర్మయి, కేవీకే సిబ్బంది శైలజ, రమేష్, స్వామి, శ్రీకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులను పంపిణీ

పెద్దశంకరంపేట, ఆగస్టు 16: పెద్దశంకరంపేట మండలపరిధిలోని కమలాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వారాహి ఇన్ఫ్రాటెక్, ప్రాజెక్టు కంపెనీ వ్యవస్థాపకుడు దివంగత విగ్రాం రామాగౌడ్ జ్ఞాపకార్థం అతని కుమారుడు బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజన్‌గౌడ్ శుక్రవారం దాదాపు రూ.50 వేల ఆట వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ స్వప్నరాజశేఖర్, మాజీ సర్పంచు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మహారాష్ట్ర హైకోర్టు జడ్జి


భద్రకాళి సమేత వీరభద్ర స్వామి సన్నిధిలో మహారాష్ట్ర హైకోర్టు జడ్జి శివకుమార్

రాయికోడ్, ఆగస్టు 16: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామిని మహారాష్ట్ర హైకోర్టు జడ్జి శివకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా జడ్జి శివకుమార్‌ను ఆలయ అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం చెప్పి, స్వామి వారికి ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జడ్జి శివకుమార్ కుటుంబ సభ్యులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కేటీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు.. దిష్టిబొమ్మల దహనం


నర్సాపూర్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


సంగారెడ్డిలో కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నర్సాపూర్, ఆగస్టు 16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎమ్మెల్యే కేటీఆర్ బస్సులలో ప్రయాణించే మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వెంటనే క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పీసీసీ పిలుపు మేరకు నర్సాపూర్ పట్టణంలోని బస్టాండు సమీపంలో లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటీఆర్ ఓటమిని జీర్ణించుకోలేక అసహనంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడన్నారు. మహిళలు అంటే గౌరవం లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైనదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత,జ్యోతిసురేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షులు అంజిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● పాపన్నపేట, ఆగస్టు 16: మహిళలను అగౌరవ పరిచేలా మాట్లాడిన కేటీఆర్ క్షమాపణ చెప్పకుంటే మహిళలు తెలంగాణలో తిరగనివ్వరని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్ పేర్కొన్నారు. మహిళలపై బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శుక్రవారం పాపన్నపేటలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద కేటీఆర్ దిష్టి బొమ్మను కాంగ్రెస్‌నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్సుల్లో మహిళలు పని లేకుండా ఊరికే తిరుగుతున్నారని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రైతు కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్‌నాయక్, మాజీ జడ్పీటీసీ మల్లప్ప, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, నాయకులు పాల్గొన్నారు.

● శివ్వంపేట: మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ వారికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వారాల గణేష్, సత్తయ్య, అరుణ్, దావూద్, శ్రీనివాస్, ఆంజనేయులు ఉన్నారు.

● వెల్దుర్తి: కేటీఆర్ మహిళలపై చేసిన వ్యాఖలను నిరసిస్తూ శుక్రవారం వెల్దుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, మల్లేశం, కిష్టగౌడ్, దుర్గా గౌడ్, నర్సింహారెడ్డి, మల్లేశం ఉన్నారు.

● నిజాంపేట: మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడిన కేటీఆర్ వారి ఆత్మగౌరవం దెబ్బతీశారని మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమర్ సేనారెడ్డి విమర్శించారు. అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యనారాయణ, నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, లింగం గౌడ్, బోయిని చంద్రం, శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

● సంగారెడ్డి టౌన్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ డిమాండ్ చేశారు. కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం సంగారెడ్డిలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా తోపాజి అనంతకిషన్ మాటట్లాడుతూ కేటీఆర్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జార్జ్, యూత్ కార్యదర్శి కూన సంతోష్, మహిళా నాయకులు అనసూయ, జ్యోతి, వాణి, కాంగ్రెస్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.